సాక్షి ఒడిశా
శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,49,442లు, బంగారం 250 మిల్లీగ్రాములు, వెండి 1 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



'సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యం'

సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ అన్నారు.

- 8లో



మాంగనీస్ అక్రమ రవాణా

ఒక లారీలో మాంగనీస్ ముడి సరుకును అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

మరో నాలుగు స్థానాలకు అభ్యర్థుల ఖరారు

భువనేశ్వర్: రాష్ట్రంలో మరో నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ గురువారం ప్రకటించింది. మహంగా నుంచి దేబేంద్ర కుమార్ సాహు, సత్యబాది నుంచి మనోజ్ రౌత్, భువనేశ్వర్ సెంట్రల్ నుంచి ప్రకాష్ చంద్ర జెనా, భువనేశ్వర్ నార్త్ నుంచి అశోక్ కుమార్ దాస్‌లను పార్టీ అభ్యర్థులుగా ప్రకటించింది. దీంతో రాష్ట్రంలోని 147 శాసనసభ స్థానాలకు గాను 126 స్థానాలకు ఇప్పటివరకు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించినట్లయ్యింది. ఈనెల 14న విడుదల చేసిన 75 మంది అభ్యర్థులతో కూడిన మూడో జాబితాలో 3 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను కూడా మార్చింది. 21 లోక్‌సభ స్థానాల్లో 17 స్థానాలకు ఎంపీ అభ్యర్థులను ఇప్పటివరకు ఆ పార్టీ ప్రకటించింది.

బీజేడీ కార్యాలయం ప్రారంభానికి సన్నాహాలు



ప్రారంభానికి సిద్ధమైన కార్యాలయం

రాయగడ: స్థానిక హోటల్ తేజస్వీ మైదానంలో సుమారు రూ.70 లక్షలతో నిర్మించిన బీజేడీ పార్టీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమయ్యింది. ఆ పార్టీ అగ్రనాయకులు ప్రణవ్ ప్రకాష్ దాస్, అతున్ సవ్యసాచిలు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలియజేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక కొత్త బస్టాండ్ వద్దనున్న బిజు పట్నాయక్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం భారీ ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ర్యాలీ అనంతరం పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం ఉంటుందని, అలాగే పార్టీ కార్యకర్తలతో సమావేశం జరుగుతుందని ఆ పార్టీ రాయగడ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారు.

నలుగురు వేటగాళ్లు అరెస్టు



అరెస్టైనవారితో అటవీ అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మహేంద్రగిరి అటవీ రేంజ్ అధికారి అమిత్ సుబ్రజిత్ ఆదేశాల మేరకు గారబంద సెక్షన్ సిబ్బంది లావణ్యగడ సంరక్షిత అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పునుగుపిల్లిని చంపి అక్రమంగా రవాణ చేస్తున్న నలుగురు వేటగాళ్లను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శ్రీకాకుళం జిల్లా శేఖరాపురం గ్రామానికి చెందినవారు ఉన్నారు. వారి వద్ద నుంచి మారణాయుధాలు తదితర వస్తువులు అటవీ అధికారులు పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి మజ్జిగౌరి చైత్రోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయి. ఐదు రోజుల పాటుగా జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం మందిరానికి సమీపంలోని జంఝావతి నది నుంచి శుద్ధ జలాలను తీసుకొచ్చారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, వద్దాది శ్రీనివాస్‌రావు, పురోహితులు, అమ్మవారి సేవకులు అంతా కలిసి గురువారం సాయంత్రం జంఝావతి నది తీరాన ప్రత్యేక పూజలను నిర్వహించి, జలాలను తీసుకొచ్చి అమ్మవారి సన్నిధిలో నిలిపారు. అనంతరం అమ్మవారికి ఆ జలాలతో శుద్ధి చేసి చైత్రోత్సవ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. శుక్రవారం సూర్య ఆవాహనంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఇదిలా ఉండగా ఈ ఉత్సవాల్లో అమ్మవారికి బంగారు ఆభరణాలతో అలంకరించారు. సునాబేసాలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తున్నారు.

రాష్ట్రంలో రూ.118.65 కోట్ల

వస్తువులు స్వాధీనం

- సీఈవో నికుంజ బిహారి ధొలొ



సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో నికుంజ బిహారి ధొలొ

భువనేశ్వర్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.118.65 కోట్ల విలువైన వివిధ వస్తువులను సీజ్ చేసినట్లు సీఈవో నికుంజ బిహారి ధొలొ గురువారం తెలియజేశారు. వీటిలో రూ. 2.7 కోట్ల నగదు, రూ.18.19 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, రూ.43.69 కోట్ల విలువైన గంజాయి, బ్రౌన్ షుగర్, రూ.7.17 కోట్ల విలువైన బంగారం ఉన్నట్లు పేర్కొన్నారు. కలహండి, నవరంగ్‌పూర్, కొరాపుట్, బరంపురం పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో 28 అసెంబ్లీ స్థానాలకు మే 13న ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. ఆ రోజు మొత్తం 6,284,649 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి ఈ నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ కోసం 3 మంది పరిశీలకులను నియమించారు. వీరు అభ్యర్థుల ఖర్చులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తారని సీఈవో తెలిపారు. తొలి విడతలో పోలింగ్ జరగనున్న 4 పార్లమెంటరీ నియోజకవర్గాల నుంచి రాష్ట్ర ఎన్నికల కార్యాలయానికి సీ-విజిల్ యాప్ ద్వారా 587 ఫిర్యాదులు అందాయి. వాటిలో 582 ఫిర్యాదులను పరిష్కరించారు. ప్రధానంగా పోస్టర్లు, బ్యానర్లకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయన్నారు.

తొలిదశ నోటిఫికేషన్ జారీ

రాష్ట్రంలో తొలి దశ ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) గురువారం విడుదల చేసింది. మే 13న ఆయా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగుతుంది. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో తొలి దశలో నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలు కలహండి, నవరంగ్‌పూర్, కొరాపుట్, బరంపురం మరియు 28 అసెంబ్లీ స్థానాల్లో ఓటింగ్ జరుగుతుంది. ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ ఏప్రిల్ 29 అని పేర్కొన్నారు. రాష్ట్రంలో మే 20, మే 25, జూన్ 1 తేదీల్లో వరుసగా రెండు, మూడు, నాలుగో దశల్లో పోలింగ్ జరగనుంది. తుది ఫలితాలను జూన్ 4న ప్రకటిస్తారు.

జగన్నాథ రథ కలప కోత ప్రారంభం



కలప కోత నిర్వహిస్తున్న దృశ్యం



రథ కలపకు పూజాదుల నిర్వహణ

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని వార్షిక యాత్ర కోసం మూడు రథాల తయారీలో వినియోగించే దుంగల కోత లాంఛనంగా ప్రారంభించారు. శ్రీరామ నవమి పురస్కరించుకుని బుధవారం కటక్ ఖపురియా ప్రభుత్వ కలప కోత మిల్లులో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆచారం ప్రకారం పూరీ నుంచి సేవకుల బృందం జగన్నాథ స్వామి ఆజ్ఞామాలతో బయల్దేరింది. రథ నిర్మాణ సూపరింటెండెంట్ సుదర్శన్ మేకప్ ఆధ్వర్యంలో 3 రథాల కోసం ఎంపిక చేసిన దౌరా కలప దుంగలకు ఆజ్ఞామాలతో పూజాదులు నిర్వహించి కోతకు శ్రీకారం చుట్టారు. అక్షయ తృతీయ నాటికి కలప చీలిక పూర్తిచేసి, పూరీ శ్రీమందిరం ఆవరణలో ఏర్పాటు చేసే రథ నిర్మాణ శాల ప్రాంగణానికి తరలిస్తారు. పవిత్ర అక్షయ తృతీయ నాడు రథాల పూర్తిస్థాయి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఆలయ ఆచారాల్లో భాగం. జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్ర రథాల నిర్మాణం పూరీలోని జగన్నాథ దేవాలయం పరిసరాల్లో రాజభవనం సమీపంలో జరుగుతుంది. 3 రథాల నిర్మాణంలో సమగ్రంగా ధౌర, ఫాసి, ఆసన జాతుల బలమైన 865 దుంగలను ఉపయోగిస్తారు.

మొదలైన నామినేషన్ల పర్వం



పర్లాకిమిడి: నామినేషన్ దాఖలు చేస్తున్న దాశరథి గొమాంగో



పర్లాకిమిడి: ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



కొరాపుట్: నామినేషన్ దాఖలు చేస్తున్న భుజబల్ మజ్జి

పర్లాకిమిడి:

గజపతి జిల్లా మోహనా (ఎస్టీ) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే దాశరథి గొమాంగో ఎన్నికల రిటర్నింగ్ అధికారి బిరేంద్రకుమార్ దాస్ ఎదుట గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు తమ పార్టీ నాయకులు బసంత పండా, బరంపురం ఎంపీ అభ్యర్థి రస్మి పట్నాయిక్, డీసీసీ మాజీ అధ్యక్షుడు బిభూతి పాత్రో, కున్నా మరిఖ, అభిమన్యు పండా తదితరులతో భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. నామినేషన్ అనంతరం మాట్లాడుతూ.. మరోసారి తాను విజయం సాధిస్తానని దీమా వ్యక్తం చేశారు.

కొరాపుట్: నబరంగ్‌పూర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా భుజబల్ మజ్జి నామినేషన్ దాఖలు చేశారు. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టరేట్‌కు తన అనుచరులతో వచ్చి నామినేషన్ పత్రాలను కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రకి అందజేశారు. జాతక రీత్యా తనకు మంచిరోజు కావడంతో నామినేషన్ వేస్తున్నానన్నారు. పార్టీ పరంగా మరోసారి నామినేషన్ వేస్తానని భుజబల్ ప్రకటించారు. మరోవైపు నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం అసెంబ్లీ బీజేడీ పార్టీ అభ్యర్థిగా స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే మనోహర్ రాంధారి నామినేషన్ దాఖలు చేశారు. తాను కూడా పార్టీ పరంగా మరోసారి నామినేషన్ వేస్తానని ప్రకటించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో కొరాపుట్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా కృష్ణ కులదీప్ నామినేషన్ దాఖలు చేశారు.

కమిటీ చైర్మన్‌గా ప్రసాద్ హరిచందన్

భువనేశ్వర్: రాష్ట్రంలో జరగనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల కోసం 26 మంది సభ్యులతో కూడిన ఎన్నికల నిర్వహణ కమిటీని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రకటించింది. 2024 లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు సార్వత్రిక ఎన్నికల కోసం ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రతిపాదించిన ఎన్నికల నిర్వహణ కమిటీకి ఏఐసీసీ అధ్యక్షుడు ఆమోదం తెలిపారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ప్రకటించారు. కమిటీ చైర్మన్‌గా ప్రసాద్ హరిచందన్ నియమితులయ్యారు. కన్వీనర్‌గా మనోరంజన్ దాస్, సంయుక్త కన్వీనర్లుగా బొంకొనిధి బెహెరా, వికాస్ గౌరొబొడు నియమితులయ్యారు. నిరంజన్ పట్నాయక్, జయదేవ్ జెనా, భక్త చరణ్ దాస్, శ్రీకాంత్ జెనా, సుశీల్ తిరియా, శరత్ రౌత్, రామచంద్ర ఖుంటియా, బిజయ్ కుమార్ పట్నాయక్, పంచానన్ కనుంగో, జగన్నాథ్ పట్నాయక్, నకుల్ నాయక్, నవజ్యోతి పట్నాయక్, మానస్ చౌదరి, హమీద్ హుస్సేన్, వందితా పరిడా, సువేందు మోహన్ పరిడా, మనోజ్ జెనా, దేబాశిష్ ఖుంయ్యా, సీతాంసు దాస్, కిషోర్ జెనా, లోక్‌నాథ్ మహారథి, రాజీవ్ పట్నాయక్‌లు కమిటీ సభ్యులుగా పేర్కొన్నారు. ఒడిశా పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఒడిశా కాంగ్రెస్ శాసనసభ నాయకులు, ఒడిశాకు ఏఐసీసీ నుంచి డిప్యూట్ చేయబడిన అన్ని వర్గాల కార్యదర్శులు, ముందంజ శాఖల ప్రముఖులు, ఒడిశా పీసీసీ సెల్స్, చైర్మన్ వార్ రూమ్, మీడియా, కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్, సోషల్ మీడియా, ఒడిశా పీసీసీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు కమిటీ సభ్యులను ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేర్చారు.

దొంగతనం కేసులో ఐదుగురు అరెస్టు



అరెస్టైన దొంగలు

జయపురం: పట్టణంలోని ప్రసాదరావుపేట నాల్గో లైన్‌లో పట్టపగలు జరిగిన దొంగతనం కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీన ప్రసాదరావుపేట నాల్గో లైన్‌లో ఎ.రాహుల్ పాత్రోకు చెందిన బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు దొంగతనానికి గురయ్యింది. స్థానిక శుభం కల్యాణ మండపంలో ఒక ఉత్సవానికి రాహుల్ పాత్రో, అతడి భార్య, అతడి కుమార్తె మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయంలో వెళ్లారు. అక్కడ నుంచి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చారు. అయితే అప్పటికే ఇంటిలో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి ఎట్టకేలకు అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో ముగ్గురు మైనర్ బాలురు, ఒకరు మేజర్‌తో పాటు దొంగలించబడిన బంగారం కొన్న వ్యక్తి ఉన్నారు. ముగ్గురు మైనర్లను బాల నేరస్తుల కేంద్రానికి తరలించామని, ప్రధాన నిందితుడు కుంభారి సాహి కృష్ణ ముదులి(27) అని వెల్లడించారు. బంగారం కొన్న ఎం.పరిచితరావును కోర్టుకు తరలించినట్లు పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయి పేర్కొన్నారు.

సొంతగూటికి రొక్కం రాంప్రసాద్



ఎమ్మెల్యే కోడూరుతో రొక్కం రాంప్రసాద్



రాంప్రసాద్ రాజీనామా లేఖ

పర్లాకిమిడి: అధికార బీజేడీ నుంచి కాశీనగర్ బ్లాక్‌కు చెందిన పలువురు నేతలు బీజేపీలో చేరుతున్నారు. బుధవారం బీజేడీ జిల్లా సాధారణ కార్యదర్శి రొక్కం రాంప్రసాద్ (జ్యోతి) బీజేపీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు కార్యాలయానికి వచ్చి పార్టీలో చేరారు. ఆయనను ఎమ్మెల్యే నారాయణరావు సాదరంగా ఆహ్వానించారు. రొక్కం రాంప్రసాద్ బీజేడీ జిల్లా సాధారణ కార్యదర్శి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2014లో రొక్కం బీజేడీ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న కోడూరు నారాయణరావు నాయకత్వంలో కీలకంగా పనిచేశారు. రాంప్రసాద్ చేరికతో మరి కొంత మంది కీలక నేతలు బీజేపీలో చేరనున్నట్టు సమాచారం.

జయపురం బీజేడీ అభ్యర్థిగా ఇందిరా నందో



మద్దతుదారులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



జయపురం: జయపురం విధానసభ బీజేడీ అభ్యర్థిగా మాజీ మంత్రి రబినారాయణ నందో సతీమణి డా.ఇందిరా నందోను అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఇటీవల తనకు గానీ, తన భార్యకు గానీ జయపురం టిక్కెట్టు కేటాయించాలని మాజీ మంత్రి రబినారాయణ నందో దాదాపు వంద మంది అనుచరులతో భువనేశ్వర్‌లో సీఎం నవీన్ పట్నాయక్, 5టీ చైర్మన్ వీకే పాండ్యన్‌ను కలిసి చర్చలు జరిపిన విషయం తెలిసిందే. దీంతో వారు ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరా నందోని అభ్యర్థిగా ప్రకటించారు. కొరాపుట్ జిల్లాలోని 5 అసెంబ్లీ స్థానాలకు గాను 4 స్థానాల్లో ఇప్పటికే బీజేడీ తమ అభ్యర్థులను ప్రకటించింది. కేవలం జయపురం స్థానం కోసం ఆశావాహులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇందిరా నందో ఇదివరకు కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ఆమె బీజేడీలో క్రియాశీల పాత్ర చేపట్టారు. 2014, 2019 ఎన్నికల్లో భర్తతో కలిసి ఎన్నికల ప్రచారంలో భర్తతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆ రెండు ఎన్నికల్లో రబినందో ఓటమి చెందినా ఆమె పట్టు వీడలేదు. అప్పటి నుంచి ఇందిర నందో ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటున్నారు. 2019 ఎన్నికల్లోనే ఇందిరా నందోకు టిక్కెట్టు వస్తుందని ఆ పార్టీ వర్గాలు భావించాయి. అయితే చివరి క్షణంలో పార్టీ అధిష్టానం రబి నారాయణ నందోకు టిక్కెట్టు కేటాయించింది.

జోరుగా ప్రచారం



గోపాల్‌పూర్ నియోజకవర్గంలో ప్రచారంలో భిగుభక్తి పాత్రో, విక్రమ్ పండా



విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్న రమేష్ చంద్రచావ్ పట్నాయక్



బరంపురంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి అనిల్ కుమార్

ప్రచార పర్వం

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవ్వడంతో బరంపురంలో ప్రచారం జోరు పెరిగింది. ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తూ బరంపురం లోక్‌సభ బీజేడీ అభ్యర్థి భిగుభక్తి పాత్రో, ఎమ్మెల్యే అభ్యర్థి డా.రమేష్ చంద్ర చావ్ పట్నాయక్‌గా ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నారు. మరోవైపు బీజేపీ తరపున పోటీ చేస్తున్న శాసనసభ అభ్యర్థి కె.అనిల్‌కుమార్ గెలుపుపై దీమాతో ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఇంకోవైపు గోపాల్‌పూర్ శాసనసభ అభ్యర్థిగా విక్రమ్ పండా ప్రచారం హోరెత్తిస్తున్నారు.

–బరంపురం

క్లుప్తంగా

'జోడీ' పండు



ఎచ్చెర్ల మండలంలోని చినరావుపల్లిలో నంబాడ సూర్యనారాయణకు చెందిన జీడిమామిడి తోటలో మంగళవారం ఒకే జీడిపండుకు రెండు పిక్కలు కనిపించాయి. ఈ విషయమై ఎచ్చెర్ల వ్యవసాయాధికారి సురేష్ మాట్లాడుతూ జన్యులోపాల వల్ల ఇటువంటివి ఏర్పడతాయని చెప్పారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వాసుదేవుని సన్నిధిలో మంత్రి సీదిరి



గోమాతకు పండ్లు తినిపిస్తున్న మంత్రి అప్పలరాజు, శ్రీదేవి దంపతులు

కాశీబుగ్గ: రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి, పలాస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుటుంబ సమేతంగా గురువారం మందసలోని వాసుదేవ పెరుమాళ్ ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. నామినేషన్ వేయనున్న సందర్భంగా సంబంధిత పత్రాలను స్వామివారి పాదాల వద్ద పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అప్పలరాజు, శ్రీదేవి దంపతులు గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఫరీదుపేటలో కొట్లాట



గాయపడిన కూన కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేటలో వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య గురువారం కొట్లాట జరిగినట్లు ఎచ్చెర్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. శుభకార్యం వద్ద ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారని, ఈ ఘటనలో కూన కిరణ్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించామని చెప్పారు. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఇటీవల సొంత బావపైన జరిగిన దాడి కేసులో కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

భారతీయ వారసత్వ సంపద అమూల్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇంటాక్ శ్రీకాకుళం చాప్టర్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళంలోని డచ్ భవనం వద్ద ప్రపంచ వారసత్వ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ భారతీయ వారసత్వ సంపద ఎంతో అమూల్యమైనదని, దానిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డచ్ భవనం విషయమై నెదర్లాండ్ బృందం శుక్రవారం ప్రత్యేక జూమ్ మీటింగ్‌ను తమ సభ్యులతో నిర్వహిస్తుందని తెలిపారు. సహాయ ఇంటాక్ సహాయ కన్వీనర్ వి.జగన్నాథంనాయుడు మాట్లాడుతూ వారసత్వ దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం న్యూఢిల్లీ ఇంటాక్ సంస్థ పంపిన శాశ్వత సభ్యత్వాన్ని కన్వీనర్ చేతుల మీదుగా జగన్మోహనరావుకు అందించారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, సీనియర్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏ ఫారం..బీ ఫారం అంటే..?

హిరమండలం: నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. అభ్యర్థులు ఎ ఫారం, బి ఫారం పట్టుకుని ఆర్‌ఓ ఆఫీసుకు వస్తారు. అసలు ఈ ఫారాలకు అర్థాలేంటో తెలుసా..? గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో తమ అభ్యర్థులను ప్రతిపాదిస్తూ ఇచ్చే పత్రాన్ని బీ ఫారం అంటారు. నామినేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థులు తమ రాజకీయ పార్టీలు ఇచ్చిన బీఫారం దాఖలు చేయాలి. అప్పుడే ఆ అభ్యర్థికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ గుర్తు కేటాయిస్తారు. బీఫారంను పార్టీ అధ్యక్షుడు నిర్ణయించిన వ్యక్తి జారీ చేస్తారు. బీ ఫారం జారీచేసేందుకు సంబంధిత వ్యక్తికి పార్టీ అధ్యక్షుడు ఆమోదాన్ని తెలుపుతూ ఏ ఫారం అందజేస్తారు. ఏ ఫారం ఎవరి పేరుతో అధ్యక్షుడు ఇస్తారో ఆ వ్యక్తికి పోటీ చేసే అభ్యర్థులకు బీఫారం ఇచ్చే అధికారం ఉంటుంది. తన పేరు మీద అందజేసిన ఏ ఫారంను ఆయా నియోజకవర్గాల్లోని ఎన్నికల అధికారులకు పోటీ చేసే అభ్యర్థి అందజేయాల్సి ఉంటుంది.

'సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యం'

రాయగడ:

సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ అన్నారు. స్థానిక సిరిగుడ గ్రామంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ తరుపున రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి బసంత కుమార్ ఉలక, కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి కాళీరాం మాఝిలకు అధిష్టానం టిక్కెట్లు ఖరారు చేయడంతో వారికి అభినందన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కొరాపుట్ లోక్‌సభ, రాయగడ శాసనసభ స్థానాల నుంచి పార్టీ తరుపున ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజల ఆదరాభిమానాలే ప్రచార అస్త్రాలుగా వినియోగించి ప్రజల వద్దకు వెళ్లాలన్నారు. గతం కంటే జిల్లాలో బీజేపీ పరిస్థితి ఎంతో మెరుగుపడిందని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పద్మనాభ దాస్, పట్టణ శాఖ మహిళా మోర్చ అధ్యక్షురాలు మంజులా మినియాక, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు బి.లక్ష్మీ, ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుణనిధి బాగ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న శివ పట్నాయక్ వేదికపై బసంత్, కాళీరాం తదితరులు



బసంత్, కాళీరాం మాఝిలను అభినందిస్తున్న శివ పట్నాయక్

మాంగనీస్ అక్రమ రవాణా

- ముగ్గురు వ్యక్తులు అరెస్టు



మాంగనీస్ లోడ్‌తో అధికారులకు చిక్కిన నిందితులు

రాయగడ: ఒక లారీలో మాంగనీస్ ముడి సరుకును అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఖనిజ, ప్రాకృతిక సంపదలకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందిన కాసీపూర్ సమితిలో గత కొద్ది నెలలుగా మాంగనీస్ ముడి సరుకు అక్రమ రవాణా జరుగుతున్నట్లు అధికారులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు బుధవారం అర్ధరాత్రి సమితిలోని లెల్లిగుమ్మ అటవీ రేంజ్ పరిధిలో కాపుకాసి అక్రమంగా తరలిస్తున్న మాంగనీస్ లారీని పట్టుకున్నారు. దీనికి సంబంధించి అరెస్టైనవారిలో పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాకు చెందిన వి.వెంకటేశ్వరరావు (32), ఎ.తరుణ్ కుమార్ (39), సీహెచ్ నరసింహారావు(35) లు ఉన్నారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న మాంగనీస్ ముడి సరుకు విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని అంచనా. దీనిపై కేసు నమోదు చేసిన అధికారులు నిందితులను కోర్టుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న లారీ, ముడి సరుకును శంకరడ అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో భద్రపరిచారు.

సీపీఐ(ఎం), ఆప్ అభ్యర్థుల జాబితా విడుదల

భువనేశ్వర్: భారత కమ్యూనిస్ట్ పార్టీ (ఎం), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లు రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రంలో తమ అభ్యర్థులను ప్రకటించాయి. సీపీఐ(ఎం) గురువారం 1 లోక్‌సభ, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించగా, ఆప్ రాష్ట్రంలోని 37 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి సీపీఐ (ఎం) ఆ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర శాఖ కార్యదర్శి సురేష్ పాణిగ్రాహిని అభ్యర్థిగా ప్రకటించింది. సుందర్‌గడ్ జిల్లా బొణాయ్ అసెంబ్లీ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే లక్ష్మణ్ ముండా పేరును సీపీఐ(ఎం) ప్రతిపాదించింది. గిరిజనుల ప్రాబల్యం ఉన్న ఈ నియోజకవర్గం సీపీఐ (ఎం) కంచుకోటగా వెలుగొందుతోంది. గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి విజేతగా నిలవడం విశేషం. బాలాసోర్ జిల్లా నీలగిరి అసెంబ్లీ స్థానం నుంచి జోగానంద్ దాస్, నయాగర్ జిల్లా రొణొపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి యువనేత సరోజ్ నయన్, ఖుర్దా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గిరీష్ మహరణ, సలేపూర్ నుంచి బద్రి నారాయణ దాస్, మయూర్‌భంజ్ జిల్లా మొరొడా నుంచి రైతు నాయకుడు మృత్యుంజయ్ బెహెరా, మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ అసెంబ్లీ స్థానం నుంచి గిరిజన నాయకుడు రఘునాథ్ హంతాల్‌ను సీపీఐ(ఎం) బరిలోకి దింపింది. అలాగే రాష్ట్రంలోని 37 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆప్ అభ్యర్థులను ప్రకటించింది.

కలెక్టరేట్ ఎదుట కళాసీల ఆందోళన



ఆందోళన చేస్తున్న కళాసీ సంఘం సభ్యులు

పర్లాకిమిడి: గత పది రోజులుగా జిల్లాలోని సిమెంట్, ఇనుము టోకు వ్యాపారులు బంద్ చేస్తూ తమ పొట్ట కొడుతున్నారని గజపతి జిల్లా ప్రజా కళాసీ సంఘం సభ్యులు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కాశీనాథ్ దాస్ మాట్లాడుతూ.. సిమెంట్, ఇనుము టోకు వ్యాపారులు లోడింగ్, అన్ లోడింగ్ చార్జీలు రూ.14.40 లకు పెంచాలన్న డిమాండ్‌ను తిరస్కరించి వ్యాపారాలు బంద్ చేశారని వాపోయారు. దీనివలన ఉపాధి కోల్పోతున్నామని తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ ప్రాణకృష్ణ పాణిగ్రాహి, జిల్లా శ్రమ అధికారి లోకనాథ పండాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో గజపతి ప్రజా కళాసీ సంఘం ఉపాధ్యక్షుడు పిన్నింటి నాగ, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భారీగా గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి అల్లూరి కోట గ్రామ పరిధి అడవిలో అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు 25 బస్తాల్లో గంజాయి ఉంచినట్లు అధికారులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో కలిసి గురువారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో అడవిలో గంజాయి బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయిని తూకం వేయగా 8 క్వింటాళ్లు ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల రాకను గమనించిన గంజాయి మాఫియా వ్యక్తులు పరారయ్యారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



మద్యం బాటిళ్లతో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంపీవీ 126 గ్రామానికి చెందిన అనిల్ మాండల్ అనే వ్యక్తి అక్రమంగా ఇంటి వద్దనే మద్యం అమ్ముతున్నాడు. విషయం తెలియడంతో కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి బుధవారం రాత్రి అనిల్ ఇంటిపై దాడి చేశారు. దీనిలో భాగంగా మద్యం బాటిళ్లతో పాటు రూ.3,76,000ల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి

గార:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేశామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం శిమ్మపేట జంక్షన్‌లోని కల్యాణ మండపంలో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో పేదలకు ఏ హామీలు ఇచ్చామని, వాటినే మేనిఫెస్టోలో రూపొందించి 99 శాతం అమలు చేశామని చెప్పారు. బీసీ వర్గాలకు రాజకీయంగా అనేక నామినేటెడ్ పదవులు ఇవ్వడంతో పాటు పలు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామన్నారు. బీసీల ఓట్లు వేయించుకున్న టీడీపీ వారి అభ్యున్నతికి ఏం చేసిందని ప్రశ్నించారు. బీసీలను వాడుకొని వదిలేసిన మనస్తత్వం చంద్రబాబుదని ధ్వజమెత్తారు. ప్రజల్లో తారతమ్యాలు ఉండకూడదనే ఉద్దేశంతో విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. పిల్లల బాగు కోసం తల్లి, తండ్రి ఎలా ఆలోచిస్తున్నారో ఈ ప్రభుత్వం కూడా అలాగే ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జన్మభూమి కమిటీ అనే బ్రోకర్ల ప్రభుత్వం కావాలా.. పేదల సంక్షేమానికి కృషి చేసే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కావాలో మీరే నిర్ణయించుకోవాలన్నారు. చంద్రబాబు హామీలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, అంబటి చినబాబు, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పార్టీ కన్వీనర్ పీస గోపి, ముంజేటి కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, బరాటం నాగేశ్వరరావు, శిమ్మ ధర్మరాజు, యాళ్ల నారాయణమూర్తి, కొయ్యాన చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు త్వరితగతిన చెల్లించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజులను త్వరితగతిన చెల్లించాలని, ఈనెల 24వ తేదీతో గడువు ముగుస్తుందని ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్‌ఐఓ ప్రగడ దుర్గారావు తెలిపారు. ఇటీవలి వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిలైన వారితో పాటు తమ మార్కులకు పెంచుకునేందుకు (ఇంప్రూవ్‌మెంట్/బెటర్‌మెంట్) ఆసక్తి చూపే విద్యార్థులు పరీక్ష ఫీజును ఈనెల 24 తేదీలోగా తమ కళాశాలల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ ఫలితాలపై సందేహాలున్న విద్యార్థులు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆర్‌ఐఓ చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నిర్దేశించిన ఫీజులను చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. ప్రాక్టికల్స్‌లో ఫెయిలైన విద్యార్థులకు మే ఒకటి నుంచి 4వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

కార్మికుల ఆందోళనకు తాత్కాలిక విరామం



ఆందోళన విరమించిన విశ్రాంత కార్మికులు

జయపురం: సమితి పరిధి గగణాపూర్ సేవా పేపరు మిల్లు ప్రధాన గేటు వద్ద గత 13 రోజుల నుంచి విశ్రాంత కార్మికులు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే ఎండలు అధికంగా ఉండడంతో కార్మికుల ఆందోళనకు తాత్కాలికంగా విరామం ప్రకటించారు. సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండితో చర్చలు జరిపిన అనంతరం అధికారి సూచనల ప్రకారం ఆందోళన విరమించినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని తెలిపేందుకు స్థానిక లేబర్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి వెళ్లగా, ఆయన అనారోగ్యంతో అందుబాటులో లేకపోవడంతో తమ పరిస్థితిపై చర్చించలేకపోయామని తెలిపారు. తాము వ్యాపార బదిలీ ఒప్పందం(బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్) అమలు చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నట్లు వెల్లడించారు. విశ్రాంత కార్మికుల డిమాండ్లపై ఇప్పటికైనా ఆనుకూలంగా స్పందించి పరిష్కరించకపోతే మరలా ఆందోళన చేపడతామని కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి యాజమాన్యాన్ని హెచ్చరించారు.

'అప్రమత్తత అవసరం'

ఇచ్ఛాపురం: నామినేషన్ల సమయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ, జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం పోలీసు సిబ్బందికి సూచించారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం గేట్‌కి ఇరువైపులా 100 మీటర్ల వరకు గల కటాఫ్ పాయింట్లు ఉండేలా చూసుకోవాలని పోలీసులతో అన్నారు. నామినేషన్ల ప్రక్రియకు వచ్చిన అభ్యర్థుల వాహనాలను కటాఫ్ పాయింట్ల వద్ద నిలపాలని సూచించారు. అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులు, మూడు వాహనాలకు మాత్రమే తహసీల్దార్ గేట్ వరకు అనుమతి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, సోంపేట సీఐలు ఇమ్మాన్యుయేల్ రాజు, మల్లేశ్వరరావు, ఇచ్ఛాపురం, కవిటి ఎస్‌ఐలు వి.సత్యన్నారాయణ, ఎన్.లక్ష్మణరావు, రాము పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

ఎల్.ఎన్.పేట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను కలిగి ఉండాలని మాజీ ఎంపీపీ శిమ్మ శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శిమ్మ సాంబశివరావు అన్నారు. మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో గల కోదండరామ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మూడు రోజులపాటు జరిగే పూజా కార్యక్రమాల్లో గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ నవమితోపాటు వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం సీతారాముల కల్యాణం, భక్తులకు అన్నసంతర్పణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో చేస్తున్నట్లు తెలిపారు.



విగ్రహాలకు శుద్ధి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జాగ్రత్తలు పాటించండి

మెళియాపుట్టి: ఎండల తీవ్రతంగా ఉండటంతో ఉపాధి పనుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఉదయం ఆరు గంటలకే పనులు మొదలు పెట్టాలని, చల్లని సమయాలలో ముగించాలన్నారు. పని ప్రదేశంలో నీరు, నీడ తప్పనిసరిగా ఉండాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, వృద్ధులను పనుల్లోకి తీసుకురావొద్దన్నారు. తప్పనిసరిగా కొలతలు ఇచ్చి పనులు చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ, ఈసీ

శ్రీజగన్నాథపురం.. అభివృద్ధి పథం..

మండలం : కోటబొమ్మాళి
పంచాయతీ : శ్రీజగన్నాథపురం
అనుబంధ గ్రామాలు : పొడుగుపాడు, బిర్లంగి, కుజ్జిపేట, రామచంద్రాపురం, రామకృష్ణాపురం
జనాభా : 2008 మంది

కోటబొమ్మాళి: శ్రీజగన్నాథపురం.. టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలోని కోటబొమ్మాళి మండలంలోని ఓ పంచాయతీ. పొడుగుపాడు, బిర్లంగి, కుజ్జిపేట, రామచంద్రాపురం, రామకృష్ణాపురం అనుబంధ గ్రామాలు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్ల కిందట వరకు ఈ పంచాయతీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేది. ముఖ్యంగా ఇక్కడి ప్రజలు తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఉంటున్నారన్న కక్షతో అచ్చెన్నాయుడి కుటుంబం శీతకన్ను వేసింది. ఫలితంగా మౌలిక సదుపాయాల సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం దక్కేది కాదు. ఇలాంటి తరుణంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చింది. పేదల సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో అన్ని పంచాయతీల మాదిరిగానే శ్రీజగన్నాథపురం రూపురేఖలు కూడా సమూలంగా మారాయి. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, వెల్‌నెస్ కేంద్రం, పక్కా రోడ్లు, కాలువలు.. ఇలా ఒకటేమిటి ప్రతి సంక్షేమ ఫలం గ్రామానికి అందడంతో అన్ని కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.



సచివాలయం భవన సముదాయం



శ్రీజగన్నాథపురం పంచాయతీ తారురోడ్డు



రైతు భరోసా	బియ్యంకార్డులు	జగనన్న ఇళ్లు	ఇళ్ల స్థలాలు	పింఛన్లు
799 మంది	720 మంది	76 మంది	51 మంది	346 మంది
అమ్మ ఒడి	**వైఎస్సార్ చేయూత**	**విద్యాదీవెన**	**వాహనమిత్ర**	**సున్నావడ్డీ**
163 మంది	122 మంది	185 మంది	20 మంది	40 మంది



సీసీ రోడ్లు

క్లుప్తంగా

వ్యక్తిపై కత్తితో దాడి


గాయపడ్డ సన్యాసిరావు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామానికి చెందిన ఎం.సన్యాసిరావును అదే గ్రామానికి చెందిన ఆరిపాక సంతోష్ కత్తితో గాయపర్చి హత్యాయత్నానికి పాల్పడటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ అందించిన వివరాలు.. వావిలపాడుకు చెందిన ఆరిపాక సంతోష్ మద్యం సేవిస్తూ వుంటాడు. సన్యాసిరావుకు సంతోష్ వరుసకు కుమారుడు అవుతాడు. మద్యం సేవించడం మంచిది కాదని సంతోష్‌ను మందలిస్తూ వుండే వాడు. దీన్ని తట్టుకోలేని సంతోష్ గురువారం ఉదయం సన్యాసిరావు ఇంటికి వెళ్లి కత్తితో పీకపై గాయపర్చి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. దీంతో కుటుంబీకులు సమీపంలో వున్న ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్ సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి చర్యలు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వీఆర్ పోలీసులైన్స్‌లో నడపబడుతున్న పోలీస్ వెల్ఫేర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న మూడు ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు ఎస్పీ ఎం.దీపిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్ బయాలజీతో పాటూ ఇంగ్లిష్ సబ్జెక్ట్ కూడా బోధించాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతను తెలిపే ఒరిజినల్ ధ్రువపత్రాలు, రెజ్యూమ్ తీసుకుని ఏప్రిల్ 26 ఉదయం 10 గంటలకు పాఠశాలలో నిర్వహించబోయే టీచింగ్ డెమో, మౌఖిక పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులకు బీఈడీ విద్యార్హతతో పాటూ అర్హతలు కలిగిన అభ్యర్థులు స్కూల్‌లో నిర్వహించే మౌఖిక పరీక్షకు ఆ రోజు హాజరు కావాలన్నారు. వివరాలకు 94917 99315, 91211 09485 సంప్రదించాలని కోరారు.

వెబ్‌సైట్‌లో డీఎడ్ హాల్‌టికెట్లు

విజయనగరం అర్బన్: ఈ నెల 22 నుంచి 27 వరకు జరిగే డీఎడ్ మూడవ సెమిస్టర్ (2022-24 బ్యాచ్ మరియు ఒన్స్ ఫైల్డ్), మొదటి సెమిస్టర్ (2023-25 బ్యాచ్ మరియు ఒన్స్ ఫైల్డ్) పరీక్షలకు హాజరగు విద్యార్థులకు హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో పొందుపరచామని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల కోసం 'బీఎస్ఈ.ఏపీ.జీటీవి.ఐఎన్' వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బాలికపై లైంగిక దాడి

డెంకాడ: మండలంలోని ఒక గ్రామంలో అమానవీయ ఘటన జరిగింది. దిశ పోలీసులు అందించిన వివరాలు.. బుధవారం ఏడేళ్ల బాలికపై 50 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక విజయనగరంలోని ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విజయనగరం దిశ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివాములు, వాటర్ పైపులు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామంలో మీసాల రమేష్‌కు చెందిన ఎకరన్నర గడ్డివాము, 80 నీటి పైపులు దగ్ధమయ్యాయి. గురువారం గడ్డివాము వద్ద ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి వెనువెంటనే ప్లాస్టిక్ పైపులకు మంటలు అంటుకుని కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న పొందూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు 2 లక్షల రూపాయలు మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు లబోదిబోమంటున్నాడు. అలాగే సంతకవిటి మండలం తాలాడ గ్రామానికి చెందిన బెరవ అప్పలనాయుడు, బెవర రాజారావుల గడ్డివాములతో పాటు 20 బస్తాల ధాన్యం కాలిపోయాయి. రాజాం ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సీతానగరం: మండలంలోని బక్కుపేట గ్రామంలో ఎస్ఈబీ సీఐ జె.శ్రీనివాసరావు నేతృత్వంలో గురువారం తనిఖీలు చేపట్టిన సమయంలో 190 సారా ప్యాకెట్లతో ఓ వ్యక్తి పట్టుబడగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామానికి చెందిన పి. లక్ష్మణదొర ఇంట్లో తనిఖీలు చేసి సారాను గుర్తించినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై బి.రాజశేఖర్ పట్నాయక్, జె.జగన్నాథరావు, ఎం. శ్రీవాణి, హెచ్‌సీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష రేపు

పార్వతీపురం: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రవేశానికి శనివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ గురువారం తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రవేశానికి పార్వతీపురంలో జరిగే ప్రవేశపరీక్షకు మార్చి 31లోగా దరఖాస్తు చేసుకున్న 6,7,8,9 తరగతు ల విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. ఆ రోజున ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

ఆరోగ్య ఆసరాతో భరోసా



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పాలూరి భవాని. ఈమెది బొండపల్లి గ్రామం. కొంత కాలంగా పొత్తిలో నొప్పి రావడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరింది. అక్కడ వైద్యులు స్కానింగ్ తీసి హెర్నియాగా నిర్ధారించారు. ఆమెకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేశారు. చికిత్స తర్వాత ప్రభుత్వం ఆరోగ్య ఆసరా కింద రూ.5 వేలు అందించింది. దీంతో ఆమె ఎంతగానో సంతోషిస్తోంది.

- దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఏపీలోనే ఆసరా అమలు
- ఐదేళ్లలో 1.38 లక్షల మందికి ఆసరా వర్తింపు
- ఇందుకోసం రూ.71.01 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- 1536 వ్యాధులకు ఆసరా ఇస్తున్న వైనం
- రూ.5 వేల నుంచి రూ.60వేలు వరకు అందిస్తున్న వైనం


సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరోగ్యశ్రీ రోగులు

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేద రోగులను ఆదుకుంటోంది. పైసా ఖర్చు లేకుండా వైద్యం అందించడమే కాకుండా చికిత్స అనంతరం భృతి అందిస్తోంది. దీని వల్ల ఆరోగ్యశ్రీ,, ఆరోగ్య ఆసరా పథకాలు రోగులకు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయి. రోజురోజుకు కొత్త రోగాలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. దీంతో జనం రోగాలకే అధిక మొత్తంలో వెచ్చించాల్సిన పరిస్థితి. పేద రోగులపై ఈ భారం పడకుండా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సమాజాన్ని పట్టిపీడిస్తున్న వ్యాధులను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి ఉచితంగా వైద్య సేవలు అందిస్తోంది.

ఆరోగ్య ఆసరాతో మేలు

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స చేసుకున్న వారు చికిత్సానంతరం ఎటువంటి పనులు చేసుకోలేరు. ఏ పనికి వెళ్లకపోవడం వల్ల వారు కుటుంబ పోషణకు ఇబ్బంది పడతారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆరోగ్య ఆసరా కింద చికిత్సానంతర జీవనోపాధి భృతిని ఇస్తుంది. ఆరోగ్య ఆసరా వల్ల రోగులకు ఆర్థిక భరోసా కల్గుతుంది. జిల్లాలో అధికశాతం మంది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే. అంతేకాకుండా 95 శాతానికి పైగా చిన్న కుటుంబాలే. ఇంటి పెద్దకు ఏదైనా కష్టం వస్తే ఆ ఇల్లు గడవడం చాలా కష్టమవుతుంది. అంతేకాకుండా ఇంటి పెద్దను కాపాడుకోవడానికి కుటుంబ సభ్యులు అంతా ఏ పనికి వెళ్లకుండా సపర్యలు చేస్తూ అక్కడే ఉండిపోతారు. ఇటువంటి పరిస్థితుల్లో కొంతమంది తినడానికి తిండి లేక పస్తులు కూడా ఉండే పరిస్థితి ఉంటుంది. ఇటువంటి వారికి ఆసరా ఎంతోగానో ఉపయోగపడుతుంది. రోజుకు రూ.225 చొప్పున నెలకు 5 వేలు వరకు భృతి ఇస్తుంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు ఎ.సన్యాసప్పడు. ఇతనిది ఎస్.కోట. కొద్ది రోజులు క్రితం పక్షవాతం బారిన పడ్డాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం క్రింద చికిత్స అందించారు. పక్షవాతం వచ్చిన రోగులు 6 నెలలు పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఆ కుటుంబ పోషణ కష్టంగా మారుతుంది. కుటుంబ పోషణ, పౌష్టికాహారం నిమిత్తం ప్రభుత్వం భృతిని చెల్లిస్తోంది. ఆరోగ్య ఆసరా కింద ప్రభుత్వం రూ.30 వేలు చెల్లించింది.

ఆరోగ్య ఆసరా వివరాలు...		
సంవత్సరం	శస్త్రచికిత్సల సంఖ్య	ఖర్చు చేసిన నిధులు
2019-20	5,444	రూ.3.75 కోట్లు
2020-21	16,078	రూ.9.65 కోట్లు
2021-22	32,615	రూ.15.51 కోట్లు
2022-23	45,746	రూ.23.12 కోట్లు
2023-24	38,899	రూ.18.95 కోట్లు

1536 వ్యాధులకు వర్తింపు

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 1536 వ్యాధులకు ఆరోగ్య ఆసరా పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా ఆపరేషన్ కోసం రోగి చేరిన వెంటనే ఆరోగ్యమిత్ర రోగి బ్యాంక్ అకౌంట్ నంబరును రిజిస్టర్ చేస్తారు. డిశ్చార్జ్ అయిన తర్వాత రోగి బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా విశ్రాంతి భృతి జమవుతుంది.

ఐదేళ్లలో 1,38,782 మందికి లబ్ధి

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం కింద గడిచిన ఐదేళ్లలో లక్షలాది మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరింది. 1,38,782 మందికి లబ్ధి చేకూరింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.71.01 కోట్లు వెచ్చించింది.

సైకిల్ మాకొద్దు బాబూ...


చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన ఆకులపేటకు చెందిన 30 కుటుంబాలు


రేగిడి : వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తదితరులు

- వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు

చీపురుపల్లి: రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన చూసి టీడీపీ వర్గీయులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. సైకిల్ మాకొద్దు.. ఫ్యానే ముద్దు అంటూ వలసపోతున్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం పలు చేరికలు జరిగాయి. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆకులపేట గ్రామానికి చెందిన పిన్నింటి, కొండేటి, మీసాల, పతివాడ ఇంటి పేరుకు చెందిన 30 కుటుంబాలు టీడీపీను వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఇటీవల తమకు తెలియకుండానే టీడీపీ కండువాలు తమకు వేశారని, టీడీపీలో ఉండే పరిస్థితే లేదని వారంతా స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన వీరికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణలు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మీసాల హరి, గవిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

13వ వార్డు నుంచి చేరికలు

ఇదిలా ఉండగా పట్టణంలోని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీలోని 13వ వార్డు నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇటీవల టీడీపీలో చేరిన 13వ వార్డు మెంబరు తల్లి సంగంరెడ్డి కనకమ్మ, సంగంరెడ్డి శివ, వెలుసూరి వెంకటరమణ తదితరులకు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జుజ్జూరు వర్మ, కంచుపల్లి అశోక్, అద్దూరి కృష్ణ, బుంగ కనకేశ్వరరావు తదితరులు ఉన్నారు.


చీపురుపల్లి రూరల్(గరివిడి) : టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

టీడీపీకి భారీ షాక్

రేగిడి : టీడీపీకి భారీ షాక్ తగిలింది. మండలంలో లక్ష్మీపురం గ్రామంలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. గురువారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావులు పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీకి చెందిన నేదూరి దుర్గయ్య, బొంతల సంగయ్య, మిరియాలు జప్పన్న, కాయల తవుడు, జోరీగల వెంకటి, కాయల రామారావు, బొంతల రామయ్య, బొంతల అప్పలరాం, నేదూరి అప్పలరాం, మిరియాల లోకేష్ తదితరులతో పాటు మరో 40కి పైగా కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను ప్రజలు అంతా ఆహ్వానిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కెంబూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు, అప్పాపురం సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బాలి తవిటినాయుడు, పాలవలస దవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి.. వైఎస్సార్‌సీపీలోకి...

- పార్టీలోకి ఆహ్వానించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని దువ్వాం పంచాయతీ నుంచి టీడీపీకి చెందిన 50 కుటుంబాలు గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీసివాసరావు సమక్షంలో పార్టీలో చేరారు. విజయనగరంలోని ఆయన నివాసం వద్ద టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోనికి వచ్చిన లారీ ఓనర్స్ అసోషియేషన్ ప్రతినిధి బాలి రామారావు, బాలి రమణ, బాలి కూర్మారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పతివాడ తవిటినాయుడు, రెల్లి పైడినాయుడు, గొర్లె లోకేష్, గొర్లె చిన్న, బాలాజీ తదితర 50 కుటుంబాలకు చెందిన వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావటం ఖాయమని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్నా, మంచి అభివృద్ధి కార్యక్రమాలు అమలు కావాలన్నా ప్రతీ ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఎమ్మెల్యే, ఎంపీ రెండు ఓట్లును వేసి ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించి జగన్‌మోహన్ రెడ్డిని సీఎంను చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ నేతేటి కృష్ణవేణి, స్థానిక నాయకుడు తోట రవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు, తాటిగూడ పీఏసీఎస్ అధ్యక్షుడు ఎడ్ల అప్పారావు, వలిరెడ్డి లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకం


స్వామివారికి పట్టాభిషేకాన్ని జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం శ్రీ రామస్వామివారి దేవస్థానంలో శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుల సమక్షంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేపట్టారు. యాగశాలలో సుందరకాండ హవనం, గాయిత్రి రామాయణ హవనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మహాపట్టాభిషేకం సజావుగా సాగాలని ముందుగా విశ్వక్సేనుడి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పూజా ద్రవ్యాలకు పుణ్యాహవచనం గావించి అష్టోత్తర సహస్ర నామార్చనలతో స్వామివారికి విశేష పూజలు చేశారు. శ్రీ సీతారామచంద్ర ప్రభువుల వారిని మంటపంలో ఆశీనులు చేసి రాములోరిని పట్టాభిషిక్తుడిని చేశారు. దీనికి ముందు స్వామివారి బంగారు కిరీటానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణ నడుమ స్వామివారికి బంగారు కిరీట దారణ చేశారు. అర్చకులు సాయి రామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, తదితరులు స్వామివారి పట్టాభిషేక మహోత్సవ ఘట్టాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని బాలుడి మృతి

రాజాం సిటీ : రాజాం పట్టణం చీపురుపల్లి రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లచ్చయ్యపేటకు చెందిన కొండేటి భరద్వాజ్(10) అనే బాలుడు మృతి చెందాడు. రాజాం వైపు వస్తున్న ఓ వాహనం టిఫిన్ నిమిత్తం రోడ్డుపైకి వచ్చిన బాలుడిని ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదం జరిగిన వెంటనే బాలుడిని ప్రైవేట్ వాహనంలో రాజాంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సను అందిస్తుండగానే మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రులు సంతు, వెంకటేష్‌లు బోరున విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న రాజాం సీఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాహనాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు.


లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఆత్మహత్య


మృతుడు శ్రీనివాసరాజు (ఫైల్)

లక్కవరపుకోట : మండలంలోని ఒక చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకలపాటి శ్రీనివాసరావు (47)గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు... నిందితుడు వారం రోజుల కిందట 8 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి యత్నించాడని బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆదివారం నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. కాగా అప్పటి నుంచి నిందితుడు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఆదివారం 10 గంటల ప్రాంతంలో ఎస్.కోట ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీపంలో పురుగులు మందు సేవించి అపస్మారక స్థితికి శ్రీనివాసరావు చేరుకోవడంతో స్థానికుల సహాయంతో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది కళ్లుగప్పి పరారయ్యాడు. దీంతో పోలీసులు నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం మండల కేంద్రం కిత్తన్నకట్టు గెడ్డ సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెళ్లి పరిశీలించగా మృతదేహం నిందితుడు శ్రీనివాసరాజుగా గుర్తించారు. ఈ మేరకు మృతుడు తల్లి, తమ్ముడులకు సమాచారం అందించగా మృతదేహాన్ని వారు వచ్చి పరిశీలించి శ్రీనివాసరాజు అని నిర్ధారించారు. మృతుడు తల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు.

పెళ్లింట విషాదం

- సారి సామగ్రి ఇచ్చేందుకు వెళ్తుండగా రోడ్డుప్రమాదం
- సంఘటన స్థలంలోనే మహిళ మృతి
- మరో పదకొండు మందికి తీవ్రగాయాలు


భద్రగిరి ఆస్పత్రిలో కమల మృతదేహం


ఆస్పత్రిలో బాలుడికి ప్రాథమిక చికిత్స చేస్తున్న వైద్యులు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: వివాహానంతరం వధువుకు ఇవ్వాల్సిన సారి సామగ్రి ఇచ్చేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదం పెళ్లివారింట విషాదం నింపింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా..మరో 11 మంది తీవ్రగాయాల పాలయ్యారు. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలంలోని కాకితాడ గ్రామానికి చెందిన పెద్దింటి కాంతారావు, సరోజినిల కుమార్తె లిజితకు కొమరాడ మండలంలోని పూడేసు గ్రామానికి చెందిన యువకుడితో ఇటీవలే వివాహమైంది. వధువుకు సారిసామగ్రి ఇచ్చేందుకు కుటుంబసభ్యులు, బంధువులు గురువారం ట్రక్కర్లు, ఆటోల్లో బయల్దేరారు.

ఈ క్రమంలో అందరికంటే వెనుకగా వధువు సొంతకుటుంబీకులను తీసుకువెళ్తున్న ట్రక్కర్ రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో అదుపుతప్పి ప్రధానరహదారిలోని కల్వర్టుగోడను బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆ వాహనంలో ఉన్న వధువు మేనత్త కమిడి కమల (55) అక్కడికక్కడే మృతిచెందగా..మృతురాలి తమ్ముడు పెద్దింటి భుజంగరావు, మరదలు సుజాత, మరో మేనకోడలు బి. సుగుణ, మేనకోడలి కుమారుడు చైతన్య, మేనకోడలు సుగుణ భర్త రవితో పాటు ఇతర కుటుంబసభ్యులు గంటా పవన్, లిమ్మ సుమన్, పాలక శశిరేఖ, పి.మారతమ్మ, ఎన్.పుష్పరాజ్‌లతో పాటు డ్రైవర్ తేజ తీవ్రగాయాలపాయ్యారు. ప్రమాదం జరిగిన విషయాన్ని గమనించిన ఇతర కుటుంబసభ్యులు క్షతగాత్రులను హుటాహుటిన భద్రగిరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో కమలను పరీక్షించిన వైద్యాధికారి రవికుమార్ ఆమె అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అలాగే తల పుర్రె భాగంలో తీవ్రంగా గాయపడిన నాలుగేళ్ల బాలుడు చైతన్యతో పాటు మారతమ్మ, పుష్పరాజు, తదితరులను మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కురుపాం ఎస్సై ఎస్.షన్ముఖరావు తెలిపారు.

అప్పుల భయంతో వ్యక్తి ఆత్మహత్య


మృతుడు సూకందొర

బాడంగి: అప్పులు తీర్చలేనన్న భయంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని చినభీమవరం గ్రామానికి చెందిన ఉయ్యాల సూకందొర అలియాస్ ఆది (45) విజయనగరంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. మృతుడు ఇంట్లో భార్యకు తెలియకుండా రూ.50వేల వరకు అప్పులు చేశాడు. ఈ మొత్తాన్ని ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురై బుధవారం ఉదయం అరటి తోట వద్ద పురుగుల మందు తాగి వాంతులు చేసుకొంటూ ఇంటికి చేరుకున్నాడు. భార్య పద్మ చూసి ఏమైందని ప్రశ్నించగా పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో కుటుంబీకుల సహాయంతో 108 ద్వారా స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి తల్లి అప్పలనర్సమ్మ, భార్య పద్మ ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఆర్.జయంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాధుల వివరాల నమోదు తప్పనిసరి


డీఎంహెచ్‌ఓతో మాట్లాడుతున్న ల్యాబ్‌టెక్నికల్ ఆఫీసర్ రవికుమార్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో నమోదయ్యే అన్ని రకాల వ్యాధుల వివరాలను ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ పోర్టల్ (ఐహెచ్‌ఐపీ)లో నమోదుచేయాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ హెల్త్ ఇంటిలిజెన్స్ (సీబీహెచ్‌ఐ) ల్యాబ్ టెక్నికల్ ఆఫీసర్ రవికుమార్ సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, ఇతర అధికారులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. జిల్లాలో ఏ ప్రాంతం, ఏ గ్రూపు వారికి, ఏ సీజన్‌లో ఏఏ రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయో గుర్తిస్తే.. వ్యాప్తిని అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, సర్వజన ఆస్పత్రిని మూడు రోజులపాటు పరిశీలిస్తామని చెప్పారు. ఆస్పత్రుల సిబ్బందికి సూచనలు ఇస్తామన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, సీబీహెచ్‌ఐ గణాంకాధికారి రామారావు, డీఎంఓ మణి, ఎస్ఓ రామారావు, డాక్టర్ వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్స్ సత్యరాజ్, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అట్లకర్ర పట్టుకున్న డాక్టర్

రాజాం: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ గురువారం రాజాం మండలంలోని బొమ్మినాయుడువలస, ముద్దాడజోగివలస, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ముద్దాడ జోగివలసలో ఓ పెళ్లి ఇంట మహిళలు వండుతున్న పిండి వంటల్లో భాగస్వామ్యమయ్యారు. డాక్టర్ కాస్త అట్లకర్ర పట్టుకోవడంతో మహిళలు మురిసిపోయారు. మహిళల ఓట్లన్నీ జగనన్నకే అంటూ సంతోషంగా చెప్పారు.